క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్టీసీ కార్మికులు

సిద్దిపేటరూరల్: ఎన్నో రోజులుగా పలు డిమాండ్లతో ఎదురుచూస్తున్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రీజియన్ కార్యదర్శి శేషు అన్నారు. బుధవారం ఆర్టీసీ యూనియన్ ఆధ్వర్యంలో వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు వినతిపత్రం అందించారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూడాలని కలెక్టర్‌ను విన్నవించారు.

'హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్'

అక్కన్నపేట(హుస్నాబాద్): తెలంగాణను అప్పుల కుప్పగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి విమర్శించారు. బుధవారం అక్కన్నపేట మండలం పోతారం(జే) గ్రామంలో పల్లె పల్లెకు ప్రవీణ్ అన్న.. గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేసే హామీలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓట్ల కోసం గతంలో ఎన్నో హామీలు ఇచ్చి మాట తప్పిన సీఎం కేసీఆర్‌ను రానున్న ఎన్నికల్లో ఓడించి ఇంటికి సాగనంపుదామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదలకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌తో ఎంతో మేలు

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వం అమలు చేస్తున్న ధరణి పోర్టల్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని హుస్నాబాద్ ఆర్డీఓ బెల్ షాలెం అన్నారు. బుధవారం దూల్మిట్ట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో భూమి రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్ల కోసం రైతులు ఇబ్బంది పడేవారని, ఇప్పుడు ఆ సమస్య తీరిందన్నారు. దూల్మిట్ట మండలంలో కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అంతకుముందు పలువురు రైతులతో ఆర్డీఓ మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్, హుస్నాబాద్ డిప్యూటీ తహసీల్దార్ అశోక్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

24 గంటల విద్యుత్ సరఫరా ఎక్కడ?

రైతు సంఘం రాష్ట్ర నాయకుడు సత్తిరెడ్డి

కొముురవెల్లి(సిద్దిపేట): మండలంలో 24 గంటల విద్యుత్ వస్తలేదని కేవలం 12 గంటల కరెంట్ మాత్రమే అందుతోందని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ముఖ్యకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ రూ.లక్ష రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేశారన్నారు. మండలంలో వర్షాభావ పరిస్థితులలో రైతులు వరి నాట్లు వేయలేకపోతున్నారని, కరెంటు లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కేసీఆర్.. కాళేశ్వరం నీళ్లు ఎటు పోతున్నాయని ప్రశ్నించారు. వెంటనే మండలంలోని రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వకపోతే రైతుల సంఘాలను ఏకం చేసి స్థానిక సబ్‌స్టేషన్ ముందు దీక్ష చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బద్దిపడగ కృష్ణారెడ్డి, ఉల్లంపల్లి సాయిలు, నీల భిక్షపతి, సార్ల యాదయ్య, ఆరుట్ల దయానంద్, వుల్లంపల్లి నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థినిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

తొగుట(దుబ్బాక): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని ఘనపు రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఫలితాల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు బుధవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్న వయసు నుంచే ఉన్నత లక్ష్యం ఏర్పరచుకొని ఆ దిశగా ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు అదనపు మరుగుదొడ్లు మంజూరు చేస్తానన్నారు. విద్యార్థులకు కంప్యూటర్లు అందజేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బుచ్చిరాజం, బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రం, బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు విభీషన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛ బల్దియాకు సహకరించాలి



వార్డులో హోటల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

సిద్దిపేటజోన్: స్వచ్ఛ బల్దియాకు వ్యాపారులు, ప్రజలు సహకారం అందించాలని మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు. బుధవారం పట్టణంలోని 33 వార్డులో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, కమిషనర్ సంపత్, వైస్ చైర్మన్ కనకరాజులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్యం చేశారు. పాత మార్కెట్‌లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవని హోటల్, దుకాణా వ్యాపారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ చెత్తను పారిశుధ్య వాహనాలకు ఇవ్వాలని సూచించారు. వారి వెంట కౌన్సిలర్లు లక్ష్మణ్, తిరుమల్, సుందర్, మోహిజ్, సురేష్, అరవింద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

హుస్నాబాద్: పట్టణంలోని ఆరెపల్లెలో బుధవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై రెవెన్యూ అధికారులు ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈవీఎం, కంట్రోల్ యూనిట్‌పై ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో వివరించారు. వచ్చే ఎన్నికల వరకు ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై ప్రతి ఓటర్‌కు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతిరోజు మూడు పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్నామని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ అధికారులు కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ సుహాసిని, జూనియర్ సహాయకులు కరీం పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ఉచిత కరెంట్

విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలు దహనం

హుస్నాబాద్: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2004లోనే లక్షలాది మంది సమక్షంలో రైతులకు ఉచిత కరెంట్ ఫైల్‌పై తొలి సంతకం పెట్టి రైతులకు అండగా నిలిచారని టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు వక్రీకరించడాన్ని నిరసిస్తూ హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా, సబ్ స్టేషన్ వద్ద కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించి, సీఎం కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ.. రైతులకు ఉచిత కరెంట్, రూ.1లక్ష రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధర కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. రైతు రాజ్యమని చెప్పుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం భూ నిర్వాసితులకు బేడీలు వేసి గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చందు, కౌన్సిలర్ రాజు, నాయకులు కిష్టస్వామి, రాజు, బాలయ్య, విద్యాసాగర్, సతీశ్, విశ్వతేజ తదితరులు ఉన్నారు.

దుబ్బాక: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు గద్దెదింపడం ఖాయమని దుబ్బాక కాంగ్రెస్ అధ్యక్షుడు కొంగరి రవి అన్నారు. దుబ్బాక పట్టణంలోని సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన వారిలో నాయకులు యేసురెడ్డి, నరేందర్‌రెడ్డి, అనంతుల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.



హుస్నాబాద్ సబ్ స్టేషన్ ఎదుట కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు, నాయకులు మహేందర్, పరశురాములు, జయంత్, గణేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రైతులకు ఉచిత విద్యుత్‌కు పునాది వేసింది కాంగ్రెస్సేనని పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్‌ను ముట్టడించారు. ఆపై భవనం ఎదుట సీఎం కేసీఆర్ ఫ్లెక్సీని దహనం చేశారు. నిరసన తెలుపుతున్న నాయకులను పోలీస్‌లు అరెస్ట్ చేసి స్టేషన్ తరలించారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ శుక్రవారం మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యవర్మ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, మహిళా జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మజార్ మాలిక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో..



చేర్యాల సబ్‌స్టేషన్ ఎదుట..

ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణ

నంగునూరు(సిద్దిపేట): మండల పరిధిలోని పాలమాకులలో బుధవారం సర్పంచ్ పంగ కుమారస్వామి ట్రాక్టర్ నడుపుతూ ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించారు. ఆరురోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుండడంతో ఇళ్లల్లో చెత్త నిల్వలు పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సర్పంచ్ స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ఇంటింటికీ తిరిగి చెత్త వేయాలని ప్రజలకు కోరారు. ఇది చూసిన పలువురు వార్డుసభ్యులు చెత్త సేకరిస్తు న్న సర్పంచ్‌కు సహకరించగా గ్రామస్తులు, మహిళలు కుమారస్వామిని అభినందించారు.

రాయపోలు(దుబ్బాక): జీపీ కార్మికులు సమ్మె చేస్తుండడంతో దౌల్తాబాద్ మండలం ఉప్పర్‌పల్లి సర్పంచ్, ఉపసర్పంచ్‌లు పారిశుధ్య కార్మికుల అవతారమెత్తారు. బుధవారం పంచాయతీ ట్రాక్టర్‌తో ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించి డంప్‌యార్డుకు తరలించారు. సర్పంచ్ చిత్తారిగౌడ్ ట్రాక్టర్ నడపగా ఉపసర్పంచ్ రేణుక ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ట్రాక్టర్‌లో వేశారు. వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు కూడా ప్రబలే అవకాశముందని, అందుకే తామే చెత్త సేకరిస్తున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు.



ట్రాక్టర్ నడుపుతూ చెత్త సేకరిస్తున్న సర్పంచ్ కుమారస్వామి

డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సొంత ఖర్చులతో పంపిణీ చేయనున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లకు మద్దూరు, దూల్మిట్ట మండలాలకు చెందిన యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం దూల్మిట్ట మండల కేంద్రంలో పలువురు యువకుల నుంచి ఎంపీపీ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలతమల్లేశం, మద్దూరు, దూల్మిట్ట మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ నాగ్గిళ్ల తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు కర్ర అరుణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వరలక్ష్మిసాగర్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బడుగు సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్‌రూరల్: జీపీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులపై వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మె బుధవారం 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ఐవోసీలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సహదేవ్‌కు వినతిపత్రం అందజేశారు.

హుస్నాబాద్: రాష్ట్ర సాధనలో జీపీ కార్మికుల పాత్ర గొప్పదని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల గౌరవ అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో బుధవారం గ్రామ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు.



హుస్నాబాద్‌లో కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని అన్ని పంచాయతీల కార్మికులు సమ్మెలో అర్ధనగ్న ప్రదర్శనచేసి నిరసన తెలిపారు. సమ్మెలో పంచాయతీ కార్మిక సంఘం నాయకులు రాజు, సాయి, భిక్షపతి, మనోజ్, పరమేశ్వరి, మల్లవ్వ పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో కార్మికులు రోడ్డుపై భోజనాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

హుస్నాబాద్: హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా కార్మికుల దీక్షా శిబిరాన్ని బుధవారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి సందర్శించారు. సమ్మెకు మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. కార్మికుల డిమాండ్లు న్యాయమైనవని, ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చాడ వెంకట్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్, రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ తదితరులు ఉన్నారు.



చేర్యాల(సిద్దిపేట): నిరసన తెలుపుతున్న కార్మికులు

సంక్షిప్త వార్తలు

◆ **ఇసుక వేలం రూ.1.91లక్షలు**

మిరుదొడ్డి(దుబ్బాక): రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక వేలానికి రూ.1.91లక్షల ఆదాయం సమకూరింది. మండల పరిధిలోని కూడవెల్లి వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను రెవెన్యూ అధికారులు పట్టుకొని సీజ్ చేసి నిల్వ ఉంచారు. కాగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సీజ్ చేసిన ఇసుకకు బుధవారం రెవెన్యూ అధికారులు వేలం పాట నిర్వహించారు. రూ.1.91లక్షలకు వేలం పాడి ఇసుక డంపులను కొండాపూర్ ఉపసర్పంచ్ జిగిరి అమర్ సొంతం చేసుకున్నాడు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయశ్రీ, ఆర్ఐలు రాజ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **సర్పంచ్ క్షమాపణ చెప్పాలి**

నంగునూరు(సిద్దిపేట): పంచాయతీ కార్మికులను దుర్భాషలాడిన గట్లమల్యాల సర్పంచ్ తిప్పని రమేశ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నంగునూరులో కార్మికులు ర్యాలీ నిర్వహించి ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్మికులు సమ్మెలో పాల్గొనద్దని గ్రామ సర్పంచ్ బెదిరిస్తూ అవహేళన చేస్తూ మాట్లాడారన్నారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లయ్య, రాజమౌళి, రవి, నర్సింలు, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎఫ్‌పీఓ చైర్మన్‌గా వెంకట్‌రెడ్డి**

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు రైతువేదికలో బుధవారం ఎఫ్‌పీఓ(రైతు ఉత్పత్తిదారుల సంస్థ) డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 15 మంది డైరెక్టర్లను ఎన్నికయ్యారు. డైరెక్టర్లు కలిసి ఎఫ్‌పీఓ నూతన చైర్మన్‌ను ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మాచాపూర్ గ్రామానికి చెందిన ఏలేటి వెంకట్‌రెడ్డి(గడ్డం)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన చైర్మన్‌ను డైరెక్టర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు పాపయ్య, నాయకులు ఘనంగా సన్మానించారు.

◆ **గ్రామాల అభివృద్ధే ధ్యేయం**

మద్దూరు(హుస్నాబాద్): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత అన్నారు. బుధవారం మండలంలోని మర్మాముల గ్రామంలో రూ.42లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను సర్పంచ్ స్రవంతితో కలిసి ఆమె ప్రారంభించారు.

◆ **అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ**

కొముురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ గ్రామంలో రూ.13.60లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి సర్పంచ్ చెరుకు రమణారెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు బాల్‌చందర్, రవీందర్, అంగన్‌వాడీ సిబ్బంది మంజుల, అరుణ, గ్రామస్తులు ఎల్లయ్య, సత్తయ్య, మురళి పాల్గొన్నారు.

◆ **పుస్తక పఠనంపై అవగాహన**

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం పఠనోత్సవం నిర్వహించారు. గ్రంథాలయం ప్రాముఖ్యత, పుస్తక పఠనం ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నైతిక విలువలను తెలియజేసే 40 రకాల ఇంగ్లిష్ కథల పుస్తకాలను ఉపాధ్యాయుడు పెరుమాండ్ల శ్రీనివాస్ పాఠశాలకు విరాళంగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భిక్షపతి, టీచర్లు పాల్గొన్నారు.

◆ **ఆరెపల్లెలో హెల్త్ సెంటర్‌ను ప్రారంభించాలి**

హుస్నాబాద్: పట్టణంలోని ఆరెపల్లెకు మంజూరైన వెల్ హెల్త్ సెంటర్‌ను పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగ సంఘం భవనంలో నిర్వహించడం సరికాదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ విమర్శించాడు. బుధవారం విశ్రాంతి ఉద్యోగ సంఘం భవనాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. సంఘ భవనంలో హెల్త్ సెంటర్‌ను నిర్వహిస్తే, బోర్డు లేదని, గర్భిణులకు ఎలాంటి సౌకర్యాలు లేవన్నారు. వెంటనే ఆరెపల్లెకు మంజూరైన వెల్ హెల్త్ సెంటర్‌ను అక్కడే ప్రారంభించాలని మల్లేశ్ డిమాండ్ చేశాడు.

రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, దిష్టిబొమ్మలు దహనం



హుస్నాబాద్‌లో..



చేర్యాల(సిద్దిపేట): దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, నాయకులు



ములుగులో..

చేర్యాల(సిద్దిపేట): రైతు వ్యతిరేక విధానాలతో ముందుకెళ్లాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం పట్టణ కేంద్రంలో గాంధీ చౌక్ వద్ద రాస్తారోకో నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీకి రైతులపై ఉన్న వైఖరి బయటపడిందన్నారు. తెలంగాణలో రైతు పరిపాలన కొనసాగుతుందని, తెలంగాణ రైతులను అవమానించేలా వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌కి రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కరుణాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణి, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, కౌన్సిలర్లు సతీశ్‌గౌడ్, చంటి, నరేందర్, రాష్ట్ర నాయకుడు ఏకానందం, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, యూత్ నాలుగు మండలాల ఇన్‌చార్జి అంజయ్య, మార్కెట్ డైరెక్టర్ తాటికొండ సదానందం, పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, ఎంపీపీ లకావత్ మానస, నాయకులు వెంకట్రాంరెడ్డి, అన్వర్ పాషా, ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ములుగు(గజ్వేల్): ములుగు రాజీవ్ రహదారిపై చేపట్టిన ఆందోళనలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, జెడ్పీ కో–ఆప్షన్ మెంబర్ సలీం, మండల పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ దేవేందర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రంలో ధర్నా నిర్వహించి సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలేషంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, సర్పంచ్‌లు చంద్రశేఖర్, నరేశ్, సత్యం, భిక్షపతి, కుమార్, రాజు, ఎంపీటీసీలు కవిత, కావ్యదర్గయ్య, రమ్యరవి తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలోని గాంధీ చౌరస్తా వద్ద చేపట్టిన నిరసనలో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కచారారి, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ సర్పంచ్‌లు రాములు, బాల్‌నర్సింహులు, కిష్టయ్య, సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

మర్కూక్(గజ్వేల్): మండల కేంద్రమైన మర్కూక్‌లో చేపట్టిన ధర్నాలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు కృష్ణయాదవ్, చైతన్యశంకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, భాస్కర్, నాగరాజు, ప్రసాద్, ప్రవీణ్, మేకల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో రైతుబంధు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కుమార్, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో పోటాపోటీ దిష్టిబొమ్మల దహనాలు


బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య ఉద్రిక్తత

గజ్వేల్: బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ దిష్టిబొమ్మ దహన కార్యక్రమాలతో బుధవారం గజ్వేల్‌లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఉచిత కరెంట్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు దిష్టిబొమ్మ దహన కార్యక్రమానికి సిద్ధమయ్యారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తదితరులు పట్టణంలోని తూప్రాన్ రోడ్డువైపున గల 33/11కేవీ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే కాంగ్రెస్ శ్రేణులు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి ఆధ్వర్యంలో రేవంత్ వ్యాఖ్యలను బీఆర్ఎస్ వక్రీకరించి గోబెల్స్ ప్రచారం చేస్తుందని ఆరోపిస్తూ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు ఒక్కసారిగా నినాదాలను హోరెత్తించారు. రేవంత్ రెడ్డి డౌన్‌డౌన్ అంటూ కాంగ్రెస్ కార్యకర్తల వైపు దూసుకొచ్చారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సైతం తగ్గకుండా సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోటాపోటీ నినాదాలతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. సమాచారం తెలుసుకున్న సీఐ వీరప్రసాద్ హుటాహుటిన సిబ్బందితో అక్కడికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేసి పక్కకు జరిపడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.

గోవర్ధనగిరి దాహం తీరింది

సాక్షి ఎఫెక్ట్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈ నెల 11వ తేదీన 'గోవర్ధనగిరి గొంతెండుతోంది'.. అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ డీఈఈ బాల్‌రాజు, ఏఈ మౌనిక స్పందించారు. ఈ సందర్భంగా గ్రామంలో మిషన్ భగీరథ పైపుల తీరు, తెగి ఉన్న భగీరథ పైపులను పరిశీలించారు. ముందుగా పాడైన గేట్‌వాల్‌ను మరమ్మతులు చేసి పరికిబండలో ఉన్న ట్యాంక్‌లో నీళ్లను సరఫరా చేస్తున్నారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. అదేవిధంగా లింగారెడ్డిపల్లిలో వృథా ఉన్న భగీరథ ట్యాంక్‌ను కూడా త్వరలో వినియోగంలోకి తీసుకొస్తామని అధికారులు చెప్పారు. దాహం తీరడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గేట్‌వాల్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సర్పంచ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, తదితరులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్ సర్పంచ్ తూం ఉమ దశదినకర్మను బుధవారం కుకునూరుపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, రైతుబంధు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురీరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, రైతుబంధు మండల కో–ఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య, స్థానిక బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు మల్లం ఐలయ్య, నాయకులు సర్పంచ్ తూం ఉమ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతురాలి భర్తను పరామర్శించి ఓదార్చారు.

పంటల నమోదు తప్పనిసరి

గజ్వేల్ ఏడీఏ బాబూనాయక్

రాయపోలు(దుబ్బాక): ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల వివరాలను రైతులు తప్పకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని గజ్వేల్ ఏడీఏ బాబూనాయక్ అన్నారు. బుధవారం రాయపోలు మండల కేంద్రంలో పర్యటించిన ఆయన పలు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల వివరాలు ఏఈఓలతో నమోదు చేయించుకోవాలని, లేకపోతే పంటలు విక్రయించే సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఆయన వెంట వ్యవసాయాధికారి, విస్తరణాధికారులు ఉన్నారు.

కోహెడరూరల్(హుస్నాబాద్): రైతులు సాగు చేసిన పంట వివరాలను వ్యవసాయ అధికారుల వద్ద తప్పక నమోదు చేసుకోవాలని ఏఈఓ శివకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని వరికోల్ గ్రామంలో ఆయన పంట వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ పొలాల్లో ఏఏ పంటలు సాగు చేశారో నమోదు చేసుకోవాలన్నారు. పంట వివరాల నమోదు ఆధారంగానే పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.



రాయపోలులో పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ బాబూనాయక్